బెస్ట్ అవైలబుల్ పాఠశాలకు విద్యార్థుల ఎంపిక

లక్కీ డ్రా తీస్తున్న విద్యార్థి

ఆసిఫాబాద్ టౌన్, జూన్ 14 : 2024-25 విద్యా సంవత్సరానికి గాను జిల్లాలోని బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో ప్రవేశాలకు అర్హత గల విద్యార్థులను లక్కీ డ్రా పద్ధతిన ఎంపిక చేశామని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి తెలిపారు. శుక్రవారం జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో లక్కీ డ్రా నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ బెస్ట్ అవైలబుల్ పాఠశాలలలో 3, 5, 8 తరగతుల్లో ప్రవేశానికి 33 మంది విద్యార్థులను ఎంపిక చేశామన్నారు. జిల్లా యువజన క్రీడా అధికారి బండ మీనారెడ్డి, ఎంసీఎంవో పుర్క ఉద్ధవ్, సహాయ గిరిజన అధికారి క్షేత్రయ్య, జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్ రావు, మండల అధ్యక్షుడు అరిగెల మల్లికార్జున్ యాదవ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

కాగజ్‌నగర్, జూన్ 14 : ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఉచిత బ్యూటీషియన్ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మహిళా సాధికారత కేంద్ర సమన్వయకర్త బీ శారద, కళాశాల ప్రిన్సిపాల్ డీ లక్ష్మీనరసింహం సూచించారు. బేటీ బచావో-బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత బ్యూటీషియన్ శిక్షణను ప్రారంభించారు. ఈ కోర్సు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని, భవిష్యత్‌లో విద్యార్థులు స్వయం ఉపాధి పొంది, ఆత్మస్థైర్యంతో ముందుకుసాగుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహిలా సాధికారత జెండర్ స్పషలిస్ట్ రాణి, శిక్షణ నిపుణురాలు రవళి, అధ్యాపకురాలు శారద, కృష్ణవేణి, విద్యార్థులు పాల్గొన్నారు.

బావిలో పడి మహిళ మృతి

లక్షెట్టిపేట, జూన్ 14: లక్షెట్టిపేట మండలం పాత కొమ్ముగూడెం గ్రామానికి చెందిన మేకల రజిత(24) దౌడేపల్లి గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో శుక్రవారం ప్రమాదవశాత్తు పడి మృతి చెందినట్లు ఎస్ఐ చంద్రకుమార్ తెలిపాడు. రజితకు చిన్నప్పటి నుంచి మానసిక పరిస్థితి బాగలేకపోవడంతో గ్రామంలో తిరుగుతూ ఉంటుంది. గురువారం దౌడేపల్లి గ్రామ శివారులోని వ్యవసాయ బావి వైపు బహిర్భూమికి వెళ్లి, ప్రమాదవశాత్తు కాలు జారి బావిలో పడింది. రజిత తల్లి మేకల శంకరవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కమిటీల ఏర్పాటులో భాగస్వాములవ్వాలి

అసిఫాబాద్ టౌన్, జూన్ 14 : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేయనున్న ఎమ్మార్పీఎస్ కమిటీల నియామకంలో సీనియర్ నాయకులు భాగస్వాములవ్వాలని ఆ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి రేగుంట కేశవరావు పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ.. 30 వరకు సంస్థాగత బలోపేతం కోసం చేపట్టనున్న గ్రామ, వార్డు, మండల, డివిజన్, మున్సిపాలిటీ , కార్పొరేషన్ పరిధిలో వివిధ విభాగాలలో నూతన కమిటీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో ఎంఎస్ పి జాతీయ నాయకుడు నందకుమార్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి రేగుంట మహేష్ తదితరులు ఉన్నారు.

రెండో ఎంపిక జాబితా విడుదల

ఆసిఫాబాద్ టౌన్, జూన్ 14 : జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో 6వ తరగతిలో ప్రవేశానికి సంబంధించిన రెండో విడుత ఎంపిక జాబితా విడుదల చేసినట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి జాబితాలో మిగిలిన 13 సీట్లను భర్తీ చేయుటకు రెండవ జాబితా విడుదల చెసినట్లు తెలిపారు.7వ తరగతిలో ఖాళీగా ఉన్న 2 సీట్లకు, 8వ తరగతిలో ఖాళీ అయిన 3 సీట్లకు కూడా ఎంపిక జాబితా విడుదల చేసినట్లు తెలిపారు.ఎంపికైన విద్యార్థులు ఈ నెల 15 నుంచి 18వ తేదీల్లో ధృవ పత్రాల పరిశీలనకు హాజరు కావాలని సూచించారు.

కొనసాగుతున్న 'బడిబాట'

దండేపల్లి, జూన్ 14 : దండేపల్లి మండలంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం కొనసాగుతున్నది. మండలంలోని మామిడిపెల్లి ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం సామూహిక అక్షరభ్యాసం నిర్వహించారు. పలు పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులను కలుస్తూ, ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేలా చైతన్యం చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కవిత, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్ ఉన్నారు.

ఆర్థిక సాయం

మందమర్రి రూరల్, జూన్ 14 : రామకృష్ణాపూర్ పట్టణంలోని సీవీ రామన్ పాఠశాలలో పదిహేనేండ్లు ఎంతోమంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయుడు కొత్వాల్ సురేందర్, గత నెల అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పాఠశాల పూర్వ విద్యార్థులు రూ.1.25 లక్షల విరాలం సేకరించి, బాధిత కుటుంబానికి శుక్రవారం అందించారు. వారిని పాఠశాల కరస్పాండెంట్ గురజాల రవీందర్రావు, ప్రధానోపాధ్యాయుడు కనుకుంట్ల సురేందర్రావు, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులతో పాటు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ పెద్దపల్లి ఉప్పలయ్య పాల్గొన్నారు.

గీత కార్మికుడిని ఆదుకోవాలి

జైపూర్, జూన్ 14 : జైపూర్ మండలం కిష్టాపూర్ గ్రామానికి చెందిన బొంగోని రమేశ్‌గౌడ్ ఈ నెల 9న తాటిచెట్టు ఎక్కుతుండగా, మోకు జారీ కిందపడి గాయపడ్డాడు. మంచిర్యాలలోని ప్రైవేటు దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు. ఖర్చు అధికమవుతుండడంతో ప్రభుత్వం ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. వైద్యంపరంగా గీతా కార్మికుడిని ఆదుకోవాలని గౌడసంఘం నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ఆదర్శ పాఠశాలలో మరో విద్యార్థికి 10 జీపీఏ

మందమర్రి రూరల్, జూన్ 14 : ఇటీవల వెలువడిన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఆదర్శ పాఠశాల విద్యార్థిని శ్రద్ధ ఆర్యకు 9.7 జీపీఏ రాగా, రీ వెరిఫికేషన్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. కాగా, రిజల్ట్ రావడంతో 10 జీపీఏ సాధించిందని ఆదర్శ(మోడల్) పాఠశాల ప్రిన్సిపాల్ జయకృష్ణ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది ఈ పాఠశాలలో ముగ్గురికి 10 జీపీఏ వచ్చినట్లు పేర్కొన్నారు.

తాడిచెట్టుపై పిడుగు

తాటి చెట్టుపై మంటలు

పెంచికల్ పేట్, జూన్ 6 : మండలంలోని గుంట్లపేట గ్రామంలో శుక్రవారం సాయంత్రం తాటి చెట్టుపై పిడుగు పడింది. సాయంత్రం సమయంలో వాతావరణంలో మార్పులతో ఒక్కసారిగా చల్లబడి తేలికపాటి చిరుజల్లులు పడ్డాయి. దీంతోపాటు చెట్టుపై పిడుగు పడడం తోపెద్ద ఎత్తున మం టలు చెలరేగాయి. పక్కనే ఉన్న విద్యు త్ స్తంభం తీగలు తెగిపోయాయి. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

ట్రాక్టర్ రోటవేటర్ కింద పడి డ్రైవర్ మృతి

చెన్నూర్ రూరల్, జూన్ 14 : చెన్నూర్ మండలం సుద్దాల గ్రామ సమీపంలోని పత్తి చేనులో శుక్రవారం ట్రాక్టర్ రోటవేటర్‌తో పనులు చేస్తుండగా, డ్రైవర్ మాంతయ్య (42) ప్రమాదవశాత్తు దాని కిందపడి మృతి చెందాడని ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. నెన్నెల మండలం చిత్తాపూర్ గ్రామానికి చెందిన మాంతయ్య, కిష్టంపేట గ్రామంలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేసేందుకు వచ్చాడు. సుద్దాల సమీపంలో శుక్రవారం ట్రాక్టర్‌తో రోటవేటర్ పనులు చేస్తున్నాడు. ట్రాక్టర్ కింద పడిమృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. మాంతయ్యకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మహిళా సంఘాల ఆర్థిక ప్రగతికి కృషి

- స్వశక్తితో ఎదిగేందుకు ప్రోత్సహించాలి
- కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే
- సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం

మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఆసిఫాబాద్ టౌన్, జూన్ 14 : మహిళా సంఘాలు స్వశక్తితో ఎదిగేందుకు చర్యలు చేపట్టాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కార్యాలయాల భవన సముదాయంలోని సమావేశ మందిరంలో శుక్రవారం అడిషనల్ కలెక్టర్ దీపక్ తివారీ, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్‌తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మహిళా సంఘాలు స్వశక్తితో ఎదిగేందుకు ప్రోత్సహించాలన్నారు. మహిళలు సొంతంగా వ్యాపారం చేసుకునేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. ఔత్సాహిక మహిళా సంఘాలు చేపల పెంపకం వైపు దృష్టి సారించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. చేపల పెంపకం ద్వారా తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయాన్ని పొందవచ్చునని తెలిపారు. మహిళా సంఘాలకు ఆర్థిక తోడ్పాటు నివ్వాలని సూచించారు. ఈ సమావేశంలో బ్యాంకు అధికారులు, సెర్ఫ్ సిబ్బంది, మెప్మా సిబ్బంది, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులు, లీడ్ బ్యాంక్ మేనేజర్, స్త్రీ శక్తి మేనేజర్, జిల్లా ప్రాజెక్టు మేనేజర్లు, సహాయ ప్రాజెక్టు మేనేజర్లు, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి స్పందన

కాసిపేట : శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఓరియంట్ అధికారులు

కాసిపేట, జూన్ 14 : కాసిపేట మండలం దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ ఆధ్వర్యంలో మంచిర్యాల ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ తరుపున నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. సాయంత్రం వరకు కొనసాగిన ఈ శిబిరంలో కార్మికులు, గ్రామస్తులు, యువకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సుమారు 500 మంది రక్తదానం చేశారు. అన్నిదానాల్లో కంటే రక్తదానం గొప్పదని, ప్రతి ఒక్కరూ ప్రాణదాతలు కావాలని ఓరియంట్ సిమెంట్ కంపెనీ యూనిట్ హెడ్ మహేంద్ర ప్రతాప్ జోషి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఓరియంట్ మహిళా మండలి అధ్యక్షురాలు ప్రీతి జోషి, సీనియర్ జీఎం ఆరంద్ కులకర్ణి, రెడ్‌క్రాస్ సొసైటీ సత్యపాల్ రెడ్డి, శరత్‌కుమార్, సత్యనారాయణ పాల్గొన్నారు.

జిల్లా ప్రభుత్వ దవాఖానలో..

మంచిర్యాల ఏసీసీ, మే 14 : ప్రపంచ రక్తదాత దినోత్సవాన్ని పురస్కరించుకొని మంచిర్యాల ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ దవాఖానలోని రక్తనిధి కేంద్రంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. 45 మంది స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేసినట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంచిర్యాల డీఎంహెచ్‌వో అనిత ప్రారంభించారు. అనంతరం రక్తదాతలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐఆర్‌సీఎస్ నిర్వాహకులు, సిబ్బంది పాల్గొన్నారు.

జైనూర్‌లో శిబిరం..

జైనూర్ : శిబిరంలో పోలీసులకు జ్యూస్ అందిస్తున్న అడ వెంకటేశ్

జైనూర్, జూన్ 14 : మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో ఆదివాసీ మిత్ర వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఎస్ఐ సందీప్‌కుమార్, ఏఎస్ఐ మాధవ్ మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ మిత్ర వేల్ఫేర్ సొసైటి అధ్యక్షుడు అడ వెంకటేశ్, బీఆర్ఎస్ యువ నాయకులు జన్నావార్ పవన్, ఆత్రం శంకర్‌కోలాం, నత్తు సింగ్, తలసేమియా రాష్ట్ర కోఆర్డినేటర్ తుమ్రం దిలీప్, సభ్యులు పూసం భీంరావు, ప్రకాశ్, ఏకలవ్య జిల్లా ఫౌండేషన్ కోఆర్డినేటర్ అమన్, కాంబ్లె గౌతం లతో పాటు పలువురు పాల్గొన్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

చింతలమానేపల్లి : బాలిక చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆరె సంఘం నాయకులు

దహెగాంలో యువకులు..

చింతలమానేపల్లి, జూన్ 14 : పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌లో దహెగాం మండల కేంద్రానికి చెందిన ఎల్కరి మహేశ్-సల్క దంపతుల 6 ఏండ్ల చిన్నారిని అత్యాచారం చేసి, హత్యచేసిన వ్యక్తిని బహిరంగంగా ఉరితీయాలని మండల ఆరెకుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు చింతలమానేపల్లి మండల కేంద్రంలోని శివాజీ చౌక్‌లో శుక్రవారం బాలిక చిత్రపటం వద్ద నివాళులర్పించారు. నిరసన వ్యక్తం చేశారు. అనంతరం నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్ఐ నరేశ్‌కు మెమోరాండం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి డుబ్బుల వెంకయ్య, ఎంపీపీ డుబ్బుల నానయ్య, జడ్పీటీసీ శ్రీదేవి, ఆరెకుల సంఘం మండల నాయకులు హరి, చంద్రశేఖర్, నారాయణ, సాయి కిరణ్, రమేశ్, రాజయ్య, లక్ష్మీనారాయణ, మారుతి, సంజీవ్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

యువకుల కొవ్వొత్తుల ర్యాలీ..

దహెగాం, జూన్ 14 : దహెగాం మండల కేంద్రానికి చెందిన చిన్నారి సహస్రను హత్య చేయడాన్ని నిరసిస్తూ మండల కేంద్రంలో యువకులు ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ తీశారు. పలు వీధుల గుండా అంగడిబజారుకు చేరుకొని, చిన్నారికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రాపర్తి జయలక్ష్మి, సింగిల్ విండో డైరెక్టర్ అల్లం మల్లేశ్, ఆరెకుల సంఘం గ్రామ కమిటీ అధ్యక్షుడు చప్పిడ తిరుపతి, యువకులు తదితరులు పాల్గొన్నారు.

రామప్ప చెరువులో చెన్నూర్‌వాసి మృతదేహం

చందన్‌సింగ్(ఫైల్)

చెన్నూర్ టౌన్, జూన్ 14 : ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం పాలంపేట శివారు రామప్ప చెరువులో చెన్నూర్ పట్టణానికి చెందిన చందన్ సింగ్ (38) మృతదేహం లభించినట్లు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. చెరువు సమీపంలో ఉన్న బైక్, ఆధారంగా చెన్నూర్‌వాసిగా గుర్తించారు. ఈ క్రమంలో చందన్‌సింగ్ మృతి, ఫొటోలు, వార్త పలు మాధ్యమాల్లో శుక్రవారం వైరల్ అయ్యాయి. చెన్నూర్ పోలీసులు కూడా కుటుంబ సభ్యుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. దీంతో వారు మృతదేహాన్ని గుర్తించారు. గతంలో అటవీ శాఖలో పనిచేసిన దివంగత భగత్ సింగ్ చిన్న కొడుకుగా నిర్ధారించారు. తల్లి రాజేశ్వరీ బాయి అటవీ శాఖలో ఉద్యోగం చేస్తున్నారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉన్నది.

చెరువును శుభ్రం చేయండి

మంచిర్యాలటౌన్, జూన్ 14 : జిల్లా కేంద్రంలోని రాముని చెరువు నుంచి తీవ్ర దుర్గంధం వెదజల్లుతున్నదని, శుభ్రం చేసేలా చర్యలు తీసుకోవాలని వాకర్స్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం నల్ల బ్యాడ్జీలు ధరించి, ప్లకార్డులతో నిరసన తెలిపారు. చెరువులోని మురుగునీటిని బయటకు ఎత్తి పోయాలని, పూడిక తీయాలని, అక్రమార్కుల నుంచి చెరువు కట్టను కాపాడాలని, సుందరీకరణ పనులను వెంటనే చెపట్టాలని డిమాండ్ చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య, ఉపాధ్యక్షుడు చింతకింది రమేశ్, తాలిబ్ ఖాన్, సలహాదారులు డాక్టర్ విశ్వేశ్వర్ రావు, రంగారావు, శ్రీనివాస్ రెడ్డి, సత్యనారాయణ మూర్తి, మనోహర్, కార్యవర్గ సభ్యులు చంద్రయ్య, హేమాజీ, సలీమ్ పాషా, రామస్వామి, వెంకటేశ్వర్లు, లక్ష్మణ్, శ్రీనన్న, కల్యాణ్, విశ్వేశ్వరా చారి, ఐలయ్య యాదవ్, రాజా చారి పాల్గొన్నారు.

నిరసన వ్యక్తం చేస్తున్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయిన ఆర్టీసీ బస్సు, రోడ్డుపైనే ఎరువుల లారీ, ఆటోలు, బైకులు

ట్రాఫిక్ సమస్యలు

- ప్రధాన రోడ్లపైనే ఎరువుల గోదాములు.. ఇరువైపులా ఆటోలు, బైకులు
- పట్టించుకోని పోలీసులు

పెంచికల్ పేట్, జూన్ 14 : పెంచికల్‌పేట్ మండల కేంద్రంలో ప్రజలు నిత్యం ట్రాఫిక్ సమస్యలతో సతమతమవుతున్నారు. శుక్రవారం వారసంత కావడంతో మరింత ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రధాన రహదారిపైనే ఫర్టిలైజర్ దుకాణాల గోదాములు ఉండడంతో నిత్యం పదుల సంఖ్యలో లారీలు వస్తున్నాయి. దీనికి తోడు రహదారిపైనే ఆటోలు, బైకుల పార్కింగ్‌తో వచ్చిపోయే వాహనాలు ఎక్కడిక్కడ నిలిచిపోతున్నాయి. శుక్రవారం సంత కావడం.., అదే సమయంలో ఆర్టీసీ బస్సు రావడంతో గంటపాటు రోడ్డుపైనే నిలిచిపోయింది. దీంతో ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చివరికి లారీ అన్‌లోడ్ కావడంతో సమస్య తీరింది. అయినా మండల అధికారులు కానీ, పోలీసులు కానీ పట్టించుకున్న పాపాన పోలేదు. కనీసం వార సంత రోజైన ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

నస్పూర్ మున్సిపల్ అభివృద్ధికి కృషి

సమావేశంలో ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

సీసీసీ నస్పూర్, జూన్ 14 : నస్పూర్ మున్సిపల్ అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు తెచ్చేందుకు కృషిచేస్తానని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు పేర్కొన్నారు. నస్పూర్ మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో చైర్మన్ సుర్మిళ్ల వేణు ఆధ్యక్షతన శుక్రవారం సాధారణ సమావేశం నిర్వహించారు. సమావేశం ఎజెండాలో మొత్తం 20 అంశాలు ప్రవేశపెట్టి, వాటిపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయా వార్డుల్లో నెలకొన్న సమస్యలను కౌన్సిలర్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కౌన్సిల్ సభ్యుల ఏకగ్రీవంతో అంశాలను ఆమోదించారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ గెల్లు రజిత, కమిషనర్ చిట్యాల సతీశ్, తహసీల్దార్ శ్రీనివాస్, మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

'బంగారం రాలే.. కేవలం చెక్కులే'

సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు

లబ్ధిదారులతో ఎమ్మెల్యే హరీశ్‌బాబు

చింతలమానేపల్లి, జూన్ 14 : 'కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చినట్లు కల్యాణలక్ష్మి కింద లబ్ధిదారులకు తులం బంగారం రాలే.. కేవలం చెక్కులే వచ్చినయ్.., ఆరు నెలలైనా హామీ అమలు చేయడంలేదు' అని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు ఆరోపించారు. ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నదని, నిధులు లేకనే ఇలా చేస్తున్నదని విమర్శించారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 114 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయడంలేదని, ఈ విషయాన్ని అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావిస్తానని తెలిపారు. అనంతరం మండలానికి చెందిన విద్యార్థులు రిషిత మండల్, సుమన్, అజ్మీరా శైలజ, తరుణ్ విద్యార్థులు ఎంబీబీఎస్, ఐఐటీలో సీట్లు సాధించగా, వారిని ఎమ్మెల్యే సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ డుబ్బుల నానయ్య, జడ్పీటీసీ డుబ్బుల శ్రీదేవి, డిప్యూటీ తహసీల్దార్ మస్కుర్ అలీ, ఎంపీడీవో కోట ప్రసాద్, కో-ఆప్షన్ సభ్యుడు నాజీమ్ హుస్సేన్, ధోని శ్రీశైలం, డుబ్బుల వెంకయ్య, మురళి, ఎల్కుంటే మల్లయ్య, రమేశ్, నారాయణ, మండల నాయకులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

కౌటాల, జూన్ 14 : మండల కేంద్రంలోని రైతువేదికలో 100 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే కల్యాణలక్ష్మి చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్, డిప్యూటీ తహసీల్దార్ రవీందర్, కౌటాల ఎంపీటీసీ బసార్కర్ శిరీష, కనికి ఎంపీటీసీ దుర్గం మోతీరాం, అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఉరేసుకొని వివాహిత ఆత్మహత్య

హాజీపూర్, జూన్ 14 : మండలంలోని ముల్కల్ల గ్రామానికి చెందిన వివాహిత గోనె రమ్య శుక్రవారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు హాజీపూర్ ఎస్ఐ సురేశ్ కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మంచిర్యాల జిల్లా పద్మశాలి కాలనీకి చెందిన గోనే శేఖర్‌ను ఎనిమిదేండ్ల క్రితం రమ్య ప్రేమించి పెండ్లి చేసుకున్నది. ఏడాది బాగానే ఉన్నా, తర్వాత శేఖర్ మద్యానికి, పేకాటకు బానిసయ్యాడు. కట్నం కావాలంటూ రమ్యను కొట్టడం, తిట్టడంతో పాటు శారీరకంగా వేధింపులకు గురి చేసేవాడు. ఇంట్లో నుంచి వెళ్లగొట్టాడు. గురువారం రమ్య తన పుట్టింటికి (ముల్కల్ల)కు వచ్చింది. శుక్రవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నది. రమ్య తల్లి అవునూరి విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అంధ పాఠశాలలో ప్రవేశాలు

నస్పూర్, జూన్ 14 : ఉత్తర తెలంగాణ జిల్లాలోని అంధ విద్యార్థుల కోసం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని మల్కాపూర్ రోడ్డులో గల ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాలలో అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ నర్మద శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 7వ తరగతి వరకు ఇంగ్లిష్ మీడియం, 10వ తరగతి వరకు తెలుగు మీడియంలో బోధిస్తున్నట్లు పేర్కొన్నారు. పాఠశాలలో ఉచిత, విద్య, భోజన వసతి ఉంటుందని తెలిపారు. విద్యతో పాటు, ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో రూపొందిన కంప్యూటర్ శిక్షణలో వివిధ కళల్లో శిక్షణ అందించనున్నట్లు పేర్కొన్నారు. 6 నుంచి 14 ఏండ్ల మధ్య ఉండి, జిల్లా మెడికల్ బోర్డుతో జారీ చేసిన సదరం సర్టిఫికెట్ (40 శాతం నుంచి 100 శాతం అంధత్వం) కలిగిన బాల బాలికలు అర్హులని తెలిపారు. వివరాలకు 94943 17315, 97011 90124, 94403 38424 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

వడ దెబ్బతో ఒకరి మృతి

భీమారం, జూన్ 14 : భీమారం మండలం దాంపూర్ గ్రామానికి చెందిన జంగపల్లి రాంచంద్రం (45) గురువారం రాత్రి వడ దెబ్బతో మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రోజూమాదిరిగానే గురువారం ఉదయం చెన్నూర్ మండలం ఎర్రగుంటపల్లిలోని మామిడి తోటలో కాపలా కాసేందుకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాగా, సాయంత్రం అస్వస్థతకు గురయ్యాడు. దీంతో కుటుంబ సభ్యులు అంబలి తాగించగా, పడుకున్నాడు. రాత్రి 11 గంటలకు మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

శాంతియుతంగా జరుపుకోవాలి

చెన్నూర్ టౌన్, జూన్ 14 : బక్రీద్ పండుగ ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సీఐ రవీందర్ తెలిపారు. చెన్నూర్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం పీస్ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో హిందూముస్లిం మత పెద్దలు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌నకు ఎంపిక

ఆసిఫాబాద్ టౌన్ : ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఆసిఫాబాద్ టౌన్, జూన్ 14 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలకు చెందిన 19 మంది విద్యార్థులు జాతీయ ప్రతిభా ఉపకారవేతనాలకు (నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్) ఎంపికైనట్లు శుక్రవారం ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఏడాదికి రూ. 12వేల చొప్పున కేంద్ర ప్రభుత్వం నుంచి ఉపకార వేతనం అందు